క్లుప్తంగా

ఘనంగా దేవాలయ వార్షికోత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న పండితులు, పాల్గొన్న భక్తులు

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని శ్రీగౌరీ నీలకంతేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయ 12వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, దీక్షా వస్త్రాల సమర్పణ, కంకణధారణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించినట్లు ఆలయ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని, చివరిరోజు శ్రీసిద్ధి, బుద్ధి గణపతి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఇళ్ల స్థలాలు ఎప్పుడు కేటాయిస్తారు?

సీపీఎం మండల కార్యదర్శి బాలరాజ్



కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు ఎప్పుడు కేటాయిస్తారో చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ పేరుతో 9 సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు కందుకూరు, యాచారం మండలాల రైతుల నుంచి సుమారు 12 వేల ఎకరాలకు పైగా భూములు తీసుకున్నారని పేర్కొన్నారు. ఎకరాకు 121 గజాల చొప్పున పట్టా సర్టిఫికెట్లు అందించి మూడేళ్లు అవుతుందని తెలిపారు. కానీ ఇంత వరకు ఒక్క రైతుకు కూడా నివాస స్థలం చూపలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే విషయమై అధికారులను అడిగిన ప్రతిసారి వారం, పది రోజులని సమాధానం దాటవేస్తున్నారని ఆరోపించారు. ఇలా చేయడం వలన ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రభుత్వం రైతులకు కేటాయించామని చెబుతున్న భూముల నుంచి హైటెన్షన్ లైన్లు వెళ్తున్నాయని, అలాంటి స్థలాలు ఇవ్వవద్దని, త్వరగా ప్లాట్లు కేటాయించాలని కోరారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వినతి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టాలని ఆ ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వాణిని స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్ధార్‌నగర్ నుంచి రావిర్యాల వచ్చే రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురై గుంతలుగా మారిందన్నారు. దీనికి తోడు సింగల్ రోడ్డు కావడం ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారిందని ఆరోపించారు. ప్రతీ మంగళవారం అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు ఈ రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ కౌన్సిలర్ రెడ్డిగళ్ల సుమన్, మాజీ సర్పంచ్ ఎడ్ల నర్సింహ, నాయకులు పి.బుచ్చిరెడ్డి, గడ్డి రాజు, శ్రీనివాస్, యాదయ్య, జంగం తదితరులు ఉన్నారు.

యూనిఫామ్స్ అందజేత



యూనిఫామ్స్ అందజేస్తున్న రాధాకృష్ణ

మలక్‌పేట: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం యూనిఫామ్స్ పంపిణీ చేసినట్లు సైదాబాద్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ తిరునగిరి రాధాకృష్ణ తెలిపారు. సైదాబాద్–1లోని 1179 మంది బాలురు, 1374 మంది బాలికల కోసం యూనిఫాంలను ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్లు తెలిపారు.

చెక్కుల పంపిణీ

మలక్‌పేట: ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అంబర్‌పేట మండలానికి చెందిన 62 మందికి మంజూరైన షాదీ ముబారక్ చెక్కులను గురువారం అందజేసి మాట్లాడారు. పేదింటి ఆడ బిడ్డలకు షాదీ ముబారక్ వరం లాంటిదన్నారు.

గొంతెండుతోంది!

- ఎన్టీఆర్‌నగర్‌లో దాహం దాహం
- మరమ్మతు కోసం గుంతలు తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్లు
- ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వివిధ కాలనీలు, బస్తీవాసులు దాహంతో అల్లాడిపోతున్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ పరిసర ప్రాంత బస్తీవాసులు నిత్యం తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. ప్రతి వేసవిలో తాగునీటితో సమస్యతో ఇక్కడి ప్రజలు సతమతమతున్నా ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారులు మాత్రం స్పందించకపోవడం బాధాకరమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి మొదలయిందంటే తాగునీటి కష్టాలు వెంటాడుతాయి. రోజు విడిచి రోజు వచ్చే కృష్ణ నీరు వారం రోజులకు ఒక్కసారి వస్తున్నాయి. అవికూడా పది నిమిషాల్లోపే ఆగిపోవడంతో అందరికీ సరిపడే నీరు అందక డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంటుందని బస్తీవాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా స్థానికులు ప్రైవేట్, జలమండలి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆదేశించినా..

తమబస్తీలో తాగునీరు రావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంతో స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి గతంలో ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించి తాగునీటి సమస్యలను నేరుగా పరిశీలించారు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి బస్తీవాసులకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. అయినా.. జలమండలి అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోక పోవడంతో ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలో తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది.



ఎన్టీఆర్‌నగర్‌లో డ్రమ్ములు పెట్టి నీటి కోసం ఎదురుచూస్తున్న కాలనీవాసులు

30 వేల జనాభా..

ఎన్టీఆర్‌నగర్ ఫేజ్–1, 2, 3లో దాదాపు 30 వేల జనాభా ఉంది. అందరూ పేద, మధ్య తరగతి ప్రజలే. ఈ ప్రాంతంలో ఎప్పుడూ తాగునీటి సమస్యతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా బస్తీల వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే మా కాలనీ, బస్తీలో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతు పేరిట తవ్వకాలు

వాల్వ్‌లు, లీకేజీల నివారణ కోసం గతంలో గుంతలు తవ్విన అధికారులు, మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో బస్తీలో తాగునీటి సమస్య తలెత్తుతుందని బస్తీవాసులు వాపోతున్నారు. ఎన్టీఆర్‌నగర్ ఫేజ్–1లో ఎత్తున్న ఉన్న ఇళ్లల్లోకి ఒక్కనీటి చుక్క నీరు కూడా రావడం లేదని బస్తీవాసులు వాపోతున్నారు. వేసవి కావడంతో బోర్లు సైతం పూర్తిగా ఇంకిపోయాయి. తప్పని పరిస్థితుల్లో డబ్బులు ఖర్చు చేసి ట్యాంకర్లతో తెప్పించుకుంటున్నామని పేర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారులు స్పందించి ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నాం



ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీరు సరఫరా కావడం లేదు. జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. డబ్బులు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఎన్టీఆర్‌నగర్ బస్తీలో తాగునీటి సరఫరా అయ్యేలా చొరవ తీసుకోవాలి.

– పోచమ్మ, ఎన్టీఆర్‌నగర్

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రణాళిక

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని సీఎస్‌కే గ్రీన్ విల్లాస్‌లో సుమారు రూ.40లక్షతో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. టీడీఎస్ నిధులు రూ.25కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, రఘునాయక్, జమృద్‌ఖాన్, శ్రావణి, నాగమణి, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్‌రబ్ జామీ, సోమశేఖర్, సాదత్, శ్రీనివాస్ రెడ్డి, శివరాంరెడ్డి, శివానంద్, డాక్టర్ చందులాల్ రాథోడ్, బాలు, ఉస్మాన్, రజింత్, బబ్బన్ సింగ్, ఉపేందర్, చంద్రశేఖర్, సత్తయ్య, పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కాంగ్రెస్‌పై మాట్లాడే హక్కు ఎమ్మెల్యేకు లేదు

ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

పహాడీషరీఫ్: కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే నైతిక హక్కు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ కో–ఆర్డినేటర్లు షేక్ జహంగిరుద్దీన్, తయ్యబ్ దయానీతో కలిసి ఆయన మాట్లాడుతూ.. జల్‌పల్లిలో సమస్యలు విలయతాండవం చేస్తున్నా స్థానిక శాసన సభ్యురాలు సబితారెడ్డికి ఏ మాత్రం పట్టడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో అన్ని రకాల పదవులు అనుభవించిన సబితారెడ్డి.. కష్టకాలంలో పార్టీని వీడిన సంగతిని కార్యకర్తలు గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, లక్ష్మీనారాయణ, నాయకులు మన్న రవి కుమార్, సయ్యద్ అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భరోసా 'ఇందిరమ్మ'



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు, లబ్ధిదారులు

కందుకూరు: నిరుపేదలకు భరోసాగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉందని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, సీనియర్ నాయకుడు ఢిల్లీ కృష్ణ కోరారు. మండల పరిధి అన్నోజిగూడలో ఇందిరమ్మ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులు సవితకు మంజూరైన ఇంటి నిర్మాణానికి గురువారం మాజీ సర్పంచ్ కాకి ఇందిరతో కలిసి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డికి, నియోజకవర్గంలో పథకాలను అమలు చేసేలా కృషి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

సైదాబాద్: డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్–సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆమె కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సైదాబాద్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానికులు సైతం తరచూ పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చారి, అచ్యుత రామయ్య, పండరినాథ్, పరమేష్, కిషోర్, చందు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.25, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.16, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.50, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.25, కీర రూ.45, బీన్స్ రూ.105, క్యాప్సికమ్ రూ.47. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9గంటల వరకు వర్తిస్తాయి.

ఆడబిడ్డలకు అవమానం

చేవెళ్ల: వీరవనితలు పుట్టిన నేలపై తెలంగాణ ఆడబిడ్డలకు అవమానం జరిగిందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి గొండ్ల కావ్యకృష్ణగౌడ్ అన్నారు. చేవెళ్లలో గురువారం ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ అందాల పోటీలకు వచ్చిన యువతుల కాళ్లను మహిళలతో రాష్ట్ర ప్రభుత్వం కడిగించటం సరైందికాదన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మ అభిమానాన్ని అందాల పోటీలకు వచ్చిన వారి పాదాల దగ్గర పెట్టేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విదేశీ అందగత్తెలకు కాలు కడిగి రుమాలతో తుడిపించటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ చర్య మహిళలకే కాదు తెలంగాణ సమాజానికి అవమానకరమన్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వం పాల్పడటం దుర్మార్గమైనదన్నారు. దీనిపై ప్రభుత్వం ముఖ్యమంత్రి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నిద్దరోతున్న నిఘా నేత్రాలు

- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- నిర్వహణ లోపం.. ఏడాదిన్నరగా పనిచేయని వైనం
- పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: ఒక్కో సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమంటూ పోలీసు అధికారులు ప్రకటనలు ఇవ్వడం మనం వింటున్నాం. దీనిని బట్టి సీసీ కెమెరాలకు పోలీసు విభాగంలో ఎంత ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. చాలా రోజులుగా వీటి మరమ్మతులపై పోలీసులు కానీ అధికారులు గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

నిర్వహణ గాలికి..

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎనిమిది గ్రామాలు ఉండగా.. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో ఆరేళ్ల క్రితం అప్పటి సర్పంచ్‌లు, దాతల సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్క గ్రామంలో 12 నుంచి 32 ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించిన హార్డ్ డిస్క్, స్క్రీన్‌ను గ్రామ పంచాయతీల్లో పెట్టారు. సర్పంచ్‌లు పదవిలో ఉన్నంతకాలం సీసీ కెమెరాల నిర్వహణను స్వయంగా నిర్వహించారు. అయితే ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. వాటికి పంచాయతీల నుంచి నిధులు ఇవ్వలేమని ప్రత్యేక అధికారులు చెప్పి వాటి నిర్వహణ గాలికొదిలేశారు.



పనిచేయని సీసీ కెమెరా

ఆరు నెలల క్రితం మున్సిపాలిటీగా..

మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పడక ముందు మున్సిపల్ పరిధిలోని 8 గ్రామాలు సైతం పంచాయతీలుగానే ఉన్నాయి. ఆయా గ్రామాల్లోనూ అప్పట్లోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరు నెలల క్రితం మున్సిపాలిటీగా ఏర్పడింది. అయినప్పటికీ సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల విషయంలో మున్సిపల్ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం. మున్సిపల్ పరిధిలోని చిలుకూరు, మొయినాబాద్, పెద్దమంగళారం, ముర్తూజగూడ, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, సురంగల్ గ్రామాల్లో.. మండల పరిధిలోని వెంకటాపూర్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, తోలుకట్ట, అమ్డాపూర్, కాశీంబౌలి, చిన్నమంగళారం, వీరన్నపేట, రెడ్డిపల్లి, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మేడిపల్లి, చందానగర్ తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. ఆయా గ్రామాల్లో కొంతమంది సొంతంగా ఇళ్లు, షాపులు, ఫాంహౌస్‌లలో ఏర్పాటు చేసిన కొన్ని సీసీ కెమెరాలు మాత్రం అక్కడక్కడ పనిచేస్తున్నాయి.



సురంగల్ జీపీలో పనిచేయని సీసీ కెమెరాల స్క్రీన్

పెరుగుతున్న నేరాలు

గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరాలు పెరుగుతున్నాయి. గ్రామాల్లో దొంగతనాలు జరుగుతున్నా సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు దొరకకుండా తప్పించుకుంటున్నారు. మరోవైపు గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు ఎక్కువవుతున్నాయి. వ్యవసాయ బోర్ల కేబుల్స్ కట్ చేసుకపోవడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగితీగలు దొంగలించడం వంటివి చాలా జరుగుతున్నాయి. గ్రామాల్లో నిఘా నేత్రాలు ఉంటే ఇలాంటి చోరీలు, నేరాలను అరికట్టవచ్చని స్థానికులు అంటున్నారు.

మరమ్మతులు చేయించాలి



గ్రామంలో చాలా రోజులుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పంచాయతీ అధికారులను అడిగితే తమకేమి సంబంధం లేదన్నట్లుగా సమాధానం చెబుతున్నారు. కెమెరాలు పనిచేయకపోవడంతో గ్రామంలో నేరాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సీసీ కెమెరాలు బాగుచేయించాలి.

–రాజమల్లేశ్, వీరన్నపేట్, మొయినాబాద్ మండలం

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను గతంలో సర్పంచ్‌లు చూసేవారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో వాటి నిర్వహణ సరిగా జరగడంలేదు. మొదటి ప్రాధాన్యతగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నాం. దాతల సహకారంతో గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలకు మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

–పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

నాగోలు: ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కొత్తపేట ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న పలు వ్యాపారాలను తొలగించారు. సర్వీస్ రోడ్లు, ఫుత్‌పాత్‌లు ఆక్రమించుకొని వ్యాపారులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిరు వ్యాపారులు, తొప్పుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మీకు కేటాయించిన స్థలంలో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.



ఆక్రమలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర శ్రావణ్‌రెడ్డి

కేశంపేట: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి మన్ననలు పొందాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాండ్ర శ్రావణ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధకశాఖలో ఖాళీలను ఇటీవల భర్తీ చేసింది. అందులో భాగంగా మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, పాపిరెడ్డిగూడ, కొండారెడ్డిపల్లి గ్రామాల్లోని పశు వైద్య ఉపకేంద్రాల్లో లైవ్ స్టాక్ అసిస్టెంట్లను కేటాయించింది. ఈ సందర్భంగా పాపిరెడ్డిగూడ గ్రామంలోని పశువైద్య ఉపకేంద్రంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా స్వప్న గురువారం విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులు పాడి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ఉద్యోగులు అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నిఖిత, శివయ్య, అబ్బి సుందరయ్య, యాదయ్య, రాణి, రవీందర్, అంజనేయులు, సత్యంగౌడ్, రామస్వామి, రాంచందర్, భిక్షపతి, కృష్ణయ్య, శ్రీను, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



విధుల్లో చేరుతున్న లైవ్‌స్టాక్ అసిస్టెంట్ స్వప్న